# నీకు

ప్రభా

దయచేసి దీన్ని చింపి వెయ్యకు నా మీద దయవుంచి దీన్ని పూర్తిగా చదువు. ఒకసారి పై నుంచి కిందికి చూసేసి "ఏమిటీ సొద" అని ఉండచుట్టి నీ ఆఫీసు అయిదో అంతస్థు నుంచి విసిరెయ్యకేం!

నీ రూమ్ బైటనున్న విజిటర్స్‌నీ, నిముషానికొకసారి మోగే నీ టెలిఫోన్‌నీ కొద్దిగా ప్రక్కకునెట్టి దీన్ని శ్రద్ధగా చదువు. నాకు వ్రాయటం గానీ, మనసులో మాట విపులంగా చెప్పటంగానీ రాదు. ఈ "సరీగా చెప్ప లేకపోవటమే"గా మనమధ్య దూరాన్ని పెంచింది. మనమధ్యదూరంఏమిటి అని ఆశ్చర్యపోకు ప్రభా. వుంది. కొద్దికొద్దిగా ఇది పెరిగింది ఈ రాత్రి దీన్ని బ్రద్దలుకొట్టాలనే నిశ్చయించుకున్నాను.

ప్రభా—ఎన్నో విషయాలు ఎప్పటికప్పుడు చెప్పాలని అను కొని కూడా చెప్పలేకపోతూ ఉంటాను. అయినా యీ విషయాన్ని ఎలా చెప్పటం? కొంచెం భయం, కొంచెం సిగ్గు కూడా వేస్తుంది. అందులో నువ్వు! ఏదయినా మాట్లాడబోతే తలతిప్పి ఒక్కక్షణం సూటిగా "ఇది జీవితం అనే బిజినెస్‌లో పనికివచ్చే మాటేనా?" అన్నట్టు చూస్తావు. అంతే! ఇక నోటివెంట మాటరాదు. అందుకే యీ నిశ్శబ్దం. అర్ధరాత్రి యిలా ఒంటరిగా కూర్చుని ఇది వ్రాస్తున్నాను. అంత నిశ్శబ్దంగానూ దీన్ని నీ బ్రౌనుకోటు జేబులో పెట్టేశాను. నీ టైంటేబిల్ ప్రకారం మంగళవారం నువ్వు తొడుక్కునేది బ్రౌవును కోటేగా.

క్షమించు ప్రభా నీ విలువయిన సమయాన్ని వృథా చేస్తున్నాను. ఎన్నో చెప్పాలి. ఎలా మొదలుపెట్టాలో అర్థం కావడంలేదు అసలు ఈ చెప్పాలనుకొన్నవి కొత్త సంగతులేమీ కావు. మనిద్దరికీ తెలిసినవే. కానీ వాటి గురించి ఒక్కసారయినా నువ్వు ఆలోచిస్తావా అని నా అనుమానం? అయినా నా గురించి ఆలోచించడానికి నీ టైంటేబిల్ లో సమయం కేటాయింపబడలేదుగా.

లైఫ్ని చాలా మామూలుగా తీసుకుంటావునువ్వు,ఏదో పుట్టినందుకు కొన్ని పనులు చెయ్యాలి కాబట్టి రొటీన్‌గా చేసుకుపోతావు. ఆ చేసేదానికి ఓ ఫీలింగ్ అనేది ఉండదు. అదే నాకు బాధగా ఉంటుంది.

నీకు తెలియదు కానీ, నేను ఒక్కదాన్నీ చేసుకునే ప్రార్థనలో నీ గురించి ఏం చేస్తానో తెలీదు కదూ "దేవా! నేనంటే నా భర్తకు కొద్దిగా ప్రేమా, కొంచెం దయా, జాలి, అనురాగం అనేవి పుట్టించి ఈ ఇంట్లో నేను అనేదాన్ని ఒకదాన్ని వున్నానని గుర్తింపు కలిగించు" అని ప్రార్థిస్తూ వుంటాను.

నీ కిదంతా ఆశ్చర్యంగా ఉంటుంది. "ఇప్పుడు నువ్వేం కష్టపడు తున్నావ్?" అని అడుగుతావ్, కష్టమంటే పెద్ద కష్టమేమీలేదు. ఈ ఏమీ లేకపోవటమే నన్ను బాధిస్తూంది. ఎప్పుడూను ఏదో సంపాదించుకోటం, తినటం, పడుకోవటం అయిపోయింది. నాకు పిల్లలు, నీకు ఆఫీసు.... అంతే.

నేను ఎంతగా ఎదురుచూస్తానో తెలుసా ప్రభా. ఇంటి చాకిరితో అలసిపోయి నీ కన్పించినప్పుడు–దగ్గరకు తీసుకుని ఒక్కమాటఅంటా వేమోనని ఎంతో చూస్తాను. దినం అంతటిలో ఒక్కక్షణం ఎక్కువసేపు కాదు. ఒక్కక్షణం ప్రేమతో చూస్తావని ఆశపడతాను. కాని నువ్వు నా అలసటని గుర్తించవు. ఇల్లు సర్దుకోవటం నా బాధ్యత ఆఫీసు కెళ్ళటం నీ బాధ్యత. ఇద్దరం మన పనులు ఎంతో క్యాజువల్‌గా పనిచేసుకు పోతు న్నామెా ఇన్ని సంవత్సరాలలో ఎప్పుడైనా గుర్తించావా? గుర్తించవు! బైట ఎన్నో పనులు నీకు, అసలు నీకా ధ్యాసే వుండదు. షేవింగ్

క్రీమూ, న్యూస్ పేపరూ, రాత్రి డిన్నర్‌లోకి సూపూ, కళ్ళజోడూ, ఖార్యా అంతా ఒకే వరుసలో ఉండాలి.

ప్రొద్దున్నే ఆఫీసుకువెళ్తూ, గుమ్మం వరకూ సాగనంపటానికివచ్చిన దాన్ని ఒక్కసారి దగ్గరకు తీసుకొన్నా - వెళ్తూ వెళుతూ వెనక్కి తిరిగి నావైపు చూసి నవ్వినా ఇక మళ్ళీ నువ్వు తిరిగివచ్చేవరకూ ఎంత తృప్తిగా ఉంటుందో! నువ్వేమో హడావుడిగా వెళ్ళిపోతావ్. నాకేమో అంతా రొటీన్, రొటీన్, రొటీన్.

ఈ విషయమే ఎప్పుడైనా ప్రస్తావిస్తే "ఆ ఏముంది అందులో–" అంటావు. ఏమీ లేకపోతే మరి రోజూ - పెళ్ళయిన కొత్తలో ఎందుకు ఎప్పుడూ ఆ ఒంటరితనం కోసమే ఎదురుచూసే వాడివి. నేను ఏ మాత్రం ఒక్క అడుగు వెనక్కి వేసినా ఎందుకు నేకంత కోపం విసుగూ వచ్చేవి? దీనికి నువ్విచ్చే సమాధానం "నా ఆవేశాన్ని వేడినీ పాడుచేసింది నువ్వే" అని. మరి దానికి నా సమాధానం చెబుతాను విను.

ప్రభా ఇవన్నీ చెప్పుకుంటున్న నన్ను బొత్తిగా సిగ్గులేని దానిగా అనుకుంటున్నావా? అయినా నా సంగతులు నీకు గాక ఇంకెవరికి చెప్పుకోను?

మన పెళ్ళయిన కొత్త జ్ఞాపకం వుందా ప్రభా. నీలో ఎంత ఆవేశ ముందో నాకైతే ఏమీ తెలీదు. ముద్దు పెట్టుకుంటే పిల్లలు పుడతారని చిన్నప్పుడెప్పుడో బామ్మ చెప్పిన మాట తప్ప, అదే అనుకొనేదాన్ని, కడుపుచీల్చి కుట్టటం గురించి, పిల్లలు పుట్టడం గురించి ఎంత భయపడే దాన్నో.

ప్రేమని ప్రకటించటం సరిగ్గా రాకపోవడమే నా తప్పా ప్రభా? ముద్దు పెట్టుకుంటున్నప్పుడు మెడచుట్టూ చేతులు వెయ్యాలన్న సంగతి పెళ్ళయిన రెండు నెలలవరకూ నేను గుర్తించలేదే అనుకో....మామూ లుగా నిలబడి వుండిపోయానే అనుకో, అదేమంత తప్పని? మొదటిరోజు నీ కళ్ళలో కనబడిన అసంతృప్తి ఇన్నాళ్ళయినా ఇంకానాకు జ్ఞాపకంవుంది నిజం చెప్పొద్దూ ఆరోజు నువ్వు ఒక్కో అడుగు ముందుకు వస్తూంటే ఎవరో పెద్ద రాక్షసుడు మీదకొస్తున్నట్టు భయం వేసింది. (ప్రేమెక్కడా?

అంతా భయమే) కళ్ళు గట్టిగా మూసుకున్నాను. వళ్ళంతా చల్లగా అయి పోయింది. అలాంటి దాని దగ్గర్నుంచి నువ్వేం "ఎక్స్‌పెక్ట్" చేస్తావు ప్రభా! దానికి తోడు నీ తొందరపాటు నిజంగా ఆ నెలరోజులూ ఎంతనర కం అనుభవించానో....నాలో ఏదో తప్పుందేమో అన్న భయం, అందరి లాంటి ఆడదాన్ని కాదేమో అన్న అనుమానం—ఏమీ తెలియకపోవడం ఎంత బాధాకరం!

ఆ రోజు నాకు బాగా జ్ఞాపకం.

పెళ్ళయిన నెలరోజులకు!

కిన్నెరసాని పక్క గెస్ట్‌హౌస్‌లో అద్దాల గదిలో వెన్నెల నిండుగా లోపలికి పడుతూన్న సమయాన పెద్ద పెద్ద చెట్ల నీడలు నిశ్శబ్దంగా మనని గమనిస్తూన్న సమయాన చంద్రుడి తాలూకు కిరణం అద్దాల కిటికీ లోంచి పక్కమీద ఎర్రగా విశ్లేషించిన సమయాన జ్ఞాపకం ఉందా ప్రభా.

ఏదో గొప్ప విజయం సాధించిన వాడిలా నువ్వు హాయిగా పడు కున్నావు. ఎందుకో తెలీదు గానీ, ఎంత ఏడుపొచ్చిందనీ! ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడుకున్నాను. నన్ను వోదార్చాలన్న ధ్యాసే నీకు లేకపోయింది హాయిగా నిద్రపోయావు. మళ్ళీ తరువాత గంటకి మెలుకువ వచ్చింది. నువ్వేమో వెల్లకిలా పడుకుని నిద్రపోతున్నావు. (నవ్వకు) లాగ్ మొద్దులా. చాలాసేపు నిన్ను చూస్తూ కూర్చున్నాను. అరణ్యంలా రొమ్ముల మీద పెరిగిన జుట్టు. అక్కడ తలపెట్టి పడుకుని కళ్ళెత్తి చూస్తే-మొనదేలిన గడ్డం, మదురైన చెంపలు, నెమ్మదిగా ముందుకు జరిగి నీకు నిద్రా భంగం కలిగించకుండా ముద్దు పెట్టుకున్నాను. అదే ప్రభా మొదటిసారి నా అంతట నేను నిన్ను ముద్దు పెట్టుకోవటం. ఆ రోజు తారీఖూ, సమయం- అన్నీ నాకు గుర్తే. మన ఈ నిస్సారమైన జీవితంలో కొద్దిగా సంతోషం కలిగించేవి అలాంటి 'చాలా కొద్ది) మధుర క్షణాలే.

ఆ రోజు గురించి ఇప్పటికీ నన్నేడిపిస్తూ వుంటావు. చెప్పు ప్రభా. అదేమీ లేకుండా, మొదటిరోజే నేను చాలా అనుభవంతో నిన్ను సంతృప్తి

పరచి ఉంటే నువ్వు సంతోషించి వుండేవాడివా? ఇప్పటి ఈ క్యాజువల్ నెస్ లేకుండా ఉండేదా? ఈ నెమ్మది నెమ్మదిగా దగ్గరకి రావడం నీకు ఇష్టం లేకపోయిందా?

నా పట్ల నీకు ఆసక్తి లేకపోవటాన్ని నెమ్మది నెమ్మదిగా ప్రదర్శిస్తూ వస్తున్నావు. అంటే నీకు వేరే స్త్రీతో సంబంధం ఉందనిగానీ, లేక ఏ వ్యసనానికో అలవాటు పడ్డావని గానీ నింద వెయ్యటంలేదు నేను. కానీ జాగ్రత్తగా గమనిస్తే మనింట్లో ఒక రకమైన నిశ్శబ్దం. శ్మశానాల్లో విని పించేది.....ఇక్కడా తాండవిస్తున్నట్లు అనిపించడంలేదూ—నిర్లిప్తంగా ఎవరి పని వారు చేసుకుంటూ పోవటం. మొదట్లో నువ్వెంత హుషారుగా వుండేవాడివి నా పట్ల!

ఏం చెయ్యను ప్రభా! అప్పటికి నా మైండ్ అంత మెచ్యూర్ కాలేదు. నా వయసెంతని అప్పుడు? పద్దెనిమిది. నువ్వు పదే పదే కోరు కోవడాన్ని వద్దనేదాన్ని. నిన్ను ప్రేరేపించాల్సినంత హుషారు నాకు లేక పోయింది ఆ రోజుల్లో.

నే నెప్పుడైతే మేల్కొని నువ్వున్న స్టేజీలోకి వచ్చేనో, దురదృష్టం కొద్దీ నువ్వా స్టేజీదాటి ముందుకు వెళ్ళిపోయావు. ఇల్లా నేను మామూలై పోయాం కానీ ఆనాడు నీలో ఎంత వేడి ఉండేదో, ఇప్పుడు నాకూ.... [అదిగో నవ్వుతున్నావ్ కదూ! ప్లీజ్ నవ్వకు] నిన్ను పూరికే చూడాలనీ, నిన్ను తాకాలనీ ఒకోసారి ఎంత పిచ్చికోర్కె పుడుతుందో. అప్పట్లో నా తాలూకు ఏ చిన్న విషయమైనా నిన్నెలా కదిలించేదో....ఇప్పుడు నాకూ అర్థమవుతూంది. నా యీ చిన్న ప్రపంచంలో నువ్వు తప్ప ఇంకెవరు న్నారు? నీ సంగతి వేరు. నీ కెన్నో వ్యాపకాలు.

నీ వైపు నుంచి సమర్థించుకోవడానికి చాలా వుండవచ్చు. కానీ ప్రభా....ఈ పరస్పర నిందలూ సమర్థించుకోవటాలు వద్దు. ఇద్దరం ఆలో

చిద్దాం. ఇన్ని కొద్ది సంవత్సరాల్లోనే ఒకరి కొకరం సాధారణ వస్తువులమై పోయామా? మనిద్దరం రాత్రిపూట కలుసుకోవటానికే సాయపడే సత్రం తప్ప ఇంకేమీ కాదా ఈ ఇల్లు. ఇదంతా వ్రాసినందుకు నా మీద కోపం తెచ్చుకోకు ప్రభా. ఇప్పుడు నువ్వు నన్ను సంతృప్తి పరచడంలేదని నే ననను. కానీ కొంచెం ప్రేమగా, ఇంకొంచెం సరదాగా, కొంచెం దయగా చాలు. ఇంతకన్నా నాకేమీ వద్దు నన్ను మాటిమాటికీ తీసి పడెయ్యకుండా నన్ను అర్థం చేసుకుంటూ నా ఫీలింగ్స్‌ని కొద్దిగా గమనిస్తూ అంతే! అంత కన్నా నేనేమీ ఎక్కువ కోరను.

ప్రభా !

పెళ్ళయిన పది సంవత్సరాల తర్వాత నేను నీకు వ్రాస్తున్న ఈ మొదటి ఉత్తరంలో నేను నీకు చెప్పగలిగేది ఒకటే అర్థం చేసుకుంటావా? జీవితాన్ని ఎప్పటికప్పుడు ఫ్రెష్‌గా మొదలు పెట్టడం. అది అలా జరిగి పోతూనే వుంటుంది. ఇంతకన్నా ఇంకేం విడమర్చి ఏం చెప్పను?

ముడతలు పడ్డ కాగితాన్ని సాఫీచేసి, చదివి ఇచ్చేస్తూ "ఎక్కడ దొరికింది నీకు?" అని అడిగేడు రామమూర్తి.

"ఆఫీసు నుంచి బైటకొస్తుంటే పై నుంచి ఉండచుట్టి విసిరేసే రెవరో, చాలా రోజుల క్రిందట" అన్నాను. చాలా టచింగ్‌గా వుంది ఆ ఉత్తరం అందుకే దాచేను.

"ఆ ప్రభ ఎవడో ఇడియట్‌లా వున్నాడు" అన్నాడు.

నేను మాట్లాడలేదు.

ఇద్దరం ఇంటివైపు నడవటం ప్రారంభించేం. సాయంత్రం సిటీ బస్సులకోసం ఎదురు చూడటం కన్నా నడకే మంచిది.

రెండు కిలోమీటర్లు నడవడానికి గంట పట్టింది. బాగా చీకటి పడింది.

ఎప్పుడూ మాట్లాడుతూ వుండే రామమూర్తి కొంచం మూడీగా, ఏదో ఆలోచిస్తూ వుండిపోయాడు. అంతసేపూ—ఇళ్ళకి విడిపోయే టైం వచ్చినప్పుడు- ఎంతో స్ట్రగుల్‌పడి, చెప్పాలనే నిర్ణయానికి వచ్చినవాడిలా, "కొంచం ఆలోచిస్తే మా ఆవిడా ఇదే అభిప్రాయంలో వున్నట్టు వుందోయ్ అన్నాడు అస్పష్టమైన చీకటి నీడల్లో అతడి మొహం వాడిపోయి వుంది. కొంచెం కాన్‌ఫ్లిక్టు. కొంచం ఘర్షణ.

నేను మాట్లాడలేదు.

"గుడ్‌నైట్" అన్చెప్పి అతను వెళ్ళిపోయాడు....

నేనలాగే నిలబడి వున్నాను.

నేనూ అలాగే.

....అందుకేగా దాచి వుంచింది.

★—★